నమస్తే తెలంగాణ
ఖమ్మం
3 | ఖమ్మం, సోమవారం 21 ఏప్రిల్ 2025 | KHAMMAM

27న కదలనున్న గులాబీదండు

- రజతోత్సవ సభకు ఉమ్మడి ఖమ్మం జిల్లా నుంచి వేలాదిమంది ప్రజలు
- వాహనాలు, భోజనాలు, రూట్‌మ్యాపులపై చర్చించిన జిల్లా నాయకత్వం
- 25న మండల కేంద్రాల్లో, 27న గ్రామాల్లో పార్టీ జెండా ఆవిష్కరణలు
- ఖమ్మం ప్రత్యేక సమావేశంలో పార్టీ ఉమ్మడి జిల్లా నేతల నిర్ణయం
- హాజరైన ఎంపీ వద్దిరాజు, ఎమ్మెల్సీ తాతా మధు, మాజీ మంత్రి అజయ్, రేగా
- పాల్గొన్న మాజీ ఎమ్మెల్యేలు సండ్ర, కందాళ, వనమా, హరిప్రియ, మెచ్చా

సమావేశంలో పాల్గొన్న బీఆర్ఎస్ ఉమ్మడి ఖమ్మం జిల్లా నేతలు వద్దిరాజు, తాతా మధు, అజయ్, రేగా తదితరులు

ఖమ్మం, ఏప్రిల్ 20 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): హనుమకొండ జిల్లా ఎల్కతుర్తిలో ఈ నెల 27న జరుపుకోనున్న పాతికేళ్ల పండుగకు ఉమ్మడి ఖమ్మం జిల్లా నుంచి గులాబీదండు కదలనుంది. ఆ రోజున జరగబోయే బీఆర్ఎస్ రజతోత్సవ సభకు అవిభాజ్య ఖమ్మం జిల్లా నుంచి తండోపతండాలుగా తరలివెళ్లేందుకు ప్రజలు సిద్ధమవుతున్నారు. సరిగ్గా వారం రోజుల సమయం మాత్రమే ఉండడంతో రజతోత్సవంలో పాల్గొనేందుకు పిల్లాపాపలతో కదిలేలా ఏర్పాట్లు చేస్తున్నారు. పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశాలతో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సూచనలతో ఉమ్మడి ఖమ్మం జిల్లా గులాబీ నాయకత్వం రజతోత్సవ సభ జయప్రదానికి సిద్ధమవుతుంది. ఈ మేరకు ఖమ్మంలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయమైన తెలంగాణభవన్‌లో ఆదివారం ఉమ్మడి జిల్లా నేతలు సమావేశమయ్యారు. వరంగల్ సభకు ఉమ్మడి ఖమ్మం జిల్లా నుంచి భారీ సంఖ్యలో ప్రజలు తరలివెళ్లేలా ప్రణాళికను రూపొందించారు. ఎమ్మెల్సీ, బీఆర్ఎస్ ఖమ్మం జిల్లా రీ అధ్యక్షుడు తాతా మధు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, పార్టీ భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు, మాజీ ఎమ్మెల్యేలు సండ్ర వెంకట వీరయ్య, కందాల ఉపేందర్‌రెడ్డి, వనమా వెంకటేశ్వరరావు, మెచ్చా నాగేశ్వరరావు, హరిప్రియా నాయక్, మదన్‌లాల్, చంద్రావతి, ఖమ్మం జడ్పీ, టీఎస్ సీడ్స్ మాజీ చైర్మన్లు లింగాల కమల్‌రాజు, కొండబాల కోటేశ్వరరావు, ఇతర నేతలు రావులపల్లి రాంప్రసాద్, మానే రామకృష్ణ హాజరయ్యారు.

పూర్తిస్థాయిలో ఏర్పాట్లు..

రజతోత్సవ సభకు ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని పది నియోజకవర్గాల నుంచి భారీ సంఖ్యలో ప్రజలు తరలివెళ్లనున్న నేపథ్యంలో వారికి వాహనాలు, భోజనాలు, తాగునీళ్లు తదితర ఏర్పాట్లపై చర్చించారు. వీటి కోసం ఇన్‌చార్జులను నియమించారు. బహిరంగ సభకు వెళ్లే రూట్‌మ్యాప్, పార్కింగ్ తదితర విషయాలపై సమాలోచనలు చేశారు. ఈ నెల 25న ఉమ్మడి జిల్లాలోని అన్ని మండల కేంద్రాల్లో 27న పార్టీ జెండాలను ఆవిష్కరించాలని నిర్ణయించారు. అలాగే, గ్రామాల్లో ఇప్పటికే ఉన్న పార్టీ దిమ్మెలను ముస్తాబు చేయాలని, దిమ్మెలు లేని గ్రామాల్లో వెంటనే నిర్మించాలని తీర్మానించారు. 27న ఉదయం అన్ని గ్రామాల్లో పార్టీ దిమ్మెలపై గులాబీ జెండాలను ఆవిష్కరించాలని, కేటాయించిన వాహనాల్లో వరంగలకు బయలుదేరాలని సూచించారు. పార్టీ ముఖ్య నాయకులు ఉప్పల వెంకటరమణ, దిండిగాల రాజేందర్, పగడాల నాగరాజు, ముత్యాల వెంకట అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

పాతికేళ్ల పండుగను సక్సెస్ చేయాలి

- రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో వార్ వన్‌సైడ్ కావాలి
- రజతోత్సవ పోస్టర్ ఆవిష్కరణలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రేగా

రజతోత్సవ సభ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న బీఆర్ఎస్ భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు

ఆళ్లపల్లి, ఏప్రిల్ 20: బీఆర్ఎస్ పాతికేళ్ల పండుగను విజయవంతం చేయాలని పార్టీ భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు, పినపాక మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు పిలుపునిచ్చారు. ఈ పాతికేళ్ల ప్రస్థానాన్ని పురస్కరించుకుంటూ ఈ నెల 27న వరంగల్‌లో నిర్వహించుకోబోతున్న రజతోత్సవ సభ ఎంతో ముఖ్యమైనదని అన్నారు. రజతోత్సవాన్ని జయప్రదం చేసేందుకు ఆళ్లపల్లి మండలం కేంద్రంలో ఆదివారం నిర్వహించిన బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో రేగా కాంతారావు మాట్లాడారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ బలపర్చే అభ్యర్థులను గెలిపించి వార్ వన్‌సైడ్ చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం రజతోత్సవ సభ పోస్టర్‌ను ఆవిష్కరించారు. బీఆర్ఎస్ నాయకులు కొమరం హనుమంతరావు, కోండ్రు మంజుభార్గవి, పాయం నరసింహారావు, షేక్ బాబా, రావుల సోమయ్య, కొమరం వెంకటేశ్వర్లు, ఖయ్యూం, భద్రం, బాబు, సత్యం, సాంబయ్య, సాయన్న, కిశోర్‌బాబు, లక్ష్మయ్య, నాగేశ్, నరసింహారావు, నరేశ్, ముసలయ్య తదితరులు పాల్గొన్నారు.

రజతోత్సవ సభకు రండి..

- ఇంటింటికీ వెళ్లి బొట్టుపెట్టి మరీ ఆహ్వానించిన 'సీతాలక్ష్మి'
- 27న వరంగల్ సభ విజయవంతానికి విస్తృత ప్రచారం

రామవరంలో పార్టీ శ్రేణులతో కలిసి ఇంటింటి ప్రచారాన్ని ప్రారంభిస్తున్న కాపు సీతాలక్ష్మి - కృష్ణ దంపతులు

కొత్తగూడెం అర్బన్, ఏప్రిల్ 20:'ఈ నెల 27న వరంగల్‌లో జరిగే బీఆర్ఎస్ రజతోత్సవ సభకు రండి' అంటూ కొత్తగూడెం మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి కోరారు. ఈ మేరకు తన భర్త, టీబీజీకేఎస్ నేత కాపు కృష్ణ సహా పార్టీ శ్రేణులతో కలిసి రామవరంలో ఆదివారం విస్తృతంగా పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి 'రజతోత్సవానికి కుటుంబ సమేతంగా హాజరుకండి' అంటూ బొట్టుపెట్టి మరీ ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, బీఆర్ఎస్ భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు, మాజీ మంత్రి వనమా వెంకటేశ్వరరావు సూచనల మేరకు రామవరంలో చేపట్టిన ఈ కార్యక్రమానికి విశేష స్పందన లభిస్తోందని అన్నారు.

ఇంటింటికీ వెళ్లి బొట్టుపెట్టి ఆహ్వానిస్తున్న సీతాలక్ష్మి

ఈ నెల 27న వరంగల్‌లో జరిగే పార్టీ రజతోత్సవంలో పార్టీ అధినేత కేసీఆర్.. భవిష్యత్ ప్రణాళికపై దిశానిర్దేశం చేయనున్నారని, ఈ సభకు వేలాదిగా తరలివచ్చేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని అన్నారు. బీఆర్ఎస్ నాయకులు ఖాజా భక్షి, షరీఫ్, మధుబాబు, జాన్, ఈశ్వరి, సుమ, రమ్యకృష్ణ, తమ్మిశెట్టి నాగమణి, పల్లవి, సుల్తానా, కతిజ, ఆషాపాసి, స్వాతి, నందిని, రాణి, వరలక్ష్మి, వాసుకి, మాలతీ, దేవీ, శైలజ, అప్పు, నవత, సుమలత తదితరులు పాల్గొన్నారు.



కల్లూరు మండలం లింగాల గ్రామంలో ఎమ్మెల్సీ కవితకు గజమాల వేస్తూ ఘన స్వాగతం పలుకుతున్న బీఆర్ఎస్ శ్రేణులు, చిత్రంలో వద్దిరాజు, తాతా మధు, సండ్ర

కల్లూరు: లింగాల సరిహద్దులో ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు ఎదురేగి స్వాగతం పలుకుతున్న బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, చిత్రంలో ప్రచార వాహనంపై కవిత, వద్దిరాజు, తాతా, సండ్ర

తెలంగాణలో.. పాలన పడకేసింది

రైతులు కన్నీళ్లు పెడుతుంటే సీఎం విదేశాల్లో విహరిస్తున్నారు

- సోనియా, రాహుల్‌లపై ఈడీ కేసులు పెట్టినా స్పందించని రేవంత్
- తడిసిన ధాన్యం, రాలిన మామిడిపూతపై సమీక్షలు కరువు
- ఖమ్మంలో ముగ్గురు మంత్రులున్నా ప్రయోజనం శూన్యం
- ప్రభుత్వాలను ప్రశ్నించే కమ్యూనిస్టులు ఏమయ్యారు?
- బీఆర్ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేయాలి
- ఖమ్మంలో విలేకరుల సమావేశంలో ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

ఖమ్మంలోని ఎంపీ వద్దిరాజు నివాసంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కవిత, చిత్రంలో వద్దిరాజు, ఎమ్మెల్సీ తాతా మధు, వైరా మాజీ ఎమ్మెల్యే మదన్‌లాల్

ఖమ్మం, ఏప్రిల్ 20 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): తెలంగాణలో పాలన పడకేసిందని, రైతులు కన్నీళ్లు పెడుతుంటే సీఎం విదేశాల్లో విహరిస్తున్నారని ఎమ్మెల్సీ, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత విమర్శించారు. ఖమ్మం జిల్లాలో ముగ్గురు మంత్రులున్నా తడిసిన ధాన్యాన్ని కొనే పరిస్థితిలేదని ఆరోపించారు. కాంగ్రెస్ అగ్రనేతలు సోనియాగాంధీ, రాహుల్‌గాంధీలపై ఈడీ కేసు నమోదు చేస్తే దేశవ్యాప్తంగా కాంగ్రెస్ ఆందోళనలు చేసినప్పటికీ తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పందించకపోవడానికి కారణమేంటని ప్రశ్నించారు. రెండురోజుల ఉమ్మడి ఖమ్మం జిల్లా పర్యటనలో భాగంగా ఆదివారం ఖమ్మం వచ్చిన కవిత.. రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర గృహంలో ఏర్పాటుచేసిన పాత్రికేయుల సమావేశంలో మాట్లాడారు. అకాల వర్షాల వల్ల కర్షకులు కన్నీళ్లు పెట్టుకుంటున్నా, ఆసుపత్రుల్లో చిన్నారులు మృత్యువాత పడుతున్నా సీఎం పట్టించుకోకుండా విదేశీ పర్యటనలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. రైతుల కష్టాలపై ఒక్క మంత్రి కూడా కనీసం సమీక్ష చేయడం లేదని విమర్శించారు. ముఖ్యమంత్రి తర్వాత అంతటి స్థాయిలో ఉన్న ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఈ జిల్లాకు చెందిన వారే అయినప్పటికీ కర్షకుల కష్టాల గురించిగానీ, తడిసి ధాన్యం గురించిగానీ ఆలోచించకపోవడం దుర్మార్గమని అన్నారు. జిల్లాలోని ముగ్గురు మంత్రులు ఒకరి మీద మరొకరు ఆధిపత్యం చెలాయించుకుంటున్నారే తప్ప ప్రజల సమస్యలను పట్టించుకోవట్లేదని దుయ్యబట్టారు. పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.20 వేల చొప్పున పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. మంత్రులు ములుగు పర్యటనకు పోతే ఆసుపత్రిలో పసిపాప మృతిచెంది తల్లిదండ్రులు ఆవేదనతో పాపను చూపిస్తున్నా మంత్రులు పట్టించుకోకపోవడం దుర్మార్గమని అన్నారు.

ముఖ్యమంత్రివి ఘోరమైన అబద్ధాలు..

ముఖ్యమంత్రి ఇచ్చిన ఏ ఒక్క హామీ అమలు కావడంలేదని ఎమ్మెల్సీ కవిత స్పష్టం చేశారు. రుణ మాఫీని సంపూర్ణం చేశామంటూ సాక్షాత్తూ ముఖ్యమంత్రే ఘోరమైన అబద్ధాలు చెబుతున్నారని దుయ్యబట్టారు. రైతు కూలీలకు ఇస్తామన్న రైతు భరోసా పథకం ఏమైందని ప్రశ్నించారు. తాను ఖమ్మం రాగానే కాంగ్రెస్ నాయకుడొకరు తన బాధను వ్యక్తం చేస్తూ గ్రామశాఖ పదవికి రాజీనామా చేశారని అన్నారు. కాంగ్రెస్ గెలుపు కోసం కృషిచేసిన నాయకులు కూడా ఆత్మపరిశీలన చేసుకొని ఎందుకు ఓటు వేశామంటూ బాధపడుతున్నారని అన్నారు. ఖమ్మం జిల్లా అంటే కమ్యూనిస్టుల ఖిల్లా అంటుంటారని, మరి ఈ కమ్యూనిసుల్టు కూడా ప్రభుత్వాన్ని ప్రశ్నించకపోవడంతో కమ్యూనిజం మీద నమ్మకం సన్నగిల్లుతోందని అన్నారు. 'ఖమ్మం జిల్లా కమ్యూనిస్టు పెద్దలు ప్రభుత్వంలో భాగస్వామ్యం కావడం వల్లే ప్రశ్నించడం లేదా?' అని ప్రశ్నించారు. తెలంగాణ ఏర్పడిన 10 నెలల్లోనే ఖమ్మం జిల్లాలో భక్తరామదాసు ప్రాజెక్టును అప్పటి సీఎం కేసీఆర్ నిర్మించి 60 వేల ఎకరాలకు నీళ్లు ఇచ్చారని గుర్తుచేశారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 16 నెలలవుతున్నా ఖమ్మం జిల్లాకు ఒక కొత్త పథకం గానీ, ప్రాజెక్టు గానీ లేవని విమర్శించారు. గత ముఖ్యమంత్రి కేసీఆర్ తన పాలనలో ఇచ్చిన ప్రతి మాటనూ నెరవేర్చారని గుర్తుచేశారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్ర ప్రజల నమ్మకాన్ని కోల్పోయిందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని, ప్రభుత్వ ప్రతినిధులను ప్రజలు ఎక్కడికక్కడ నిలదీయాలని కవిత పిలుపునిచ్చారు. ఈ నెల 27న జరిగే బీఆర్ఎస్ రజతోత్సవ సభతో తెలంగాణలో ఒక ఉత్సాహకర వాతావరణ నెలకొనబోతోందని అన్నారు. రజతోత్సవాన్ని విజయవంతం చేయాలని, బలమైన నాయకత్వమున్న ఖమ్మం జిల్లా నుంచి ప్రజలు పెద్ద సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీ, బీఆర్ఎస్ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు తాతా మధు, మాజీ ఎమ్మెల్యేలు హరిప్రియానాయక్, మదన్‌లాల్, చంద్రావతి, టీఎస్ సీడ్స్ మాజీ చైర్మన్ కొండబాల కోటేశ్వరరావు, సీనియర్ నాయకుడు బొమ్మెర రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ జాతీయ నాయకుడు పువ్వాడ నాగేశ్వరరావును ఎమ్మెల్సీ కవిత ఆదివారం పరామర్శించారు. ఖమ్మంలోని ఆయన గృహానికి వెళ్లి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు.

కేసీఆరే తెలంగాణకు శ్రీరామరక్ష

- రాష్ట్ర ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం
- కల్లూరు పర్యటనలో ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

పెనుబల్లి, ఏప్రిల్ 20: కేసీఆరే తెలంగాణకు శ్రీరామరక్ష అని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత పేర్కొన్నారు. బీఆర్ఎస్ మళ్లీ అధికారంలోకి వచ్చేంత వరకు ప్రతి కార్యకర్త, అభిమాని కృషి చేయాలని కోరారు. నాయకులను తయారు చేసిన కేంద్రం సత్తుపల్లి నియోజకవర్గమని, ఈ నెల 27న తలపెట్టిన బీఆర్ఎస్ రజతోత్సవ బహిరంగ సభకు లక్షలాదిగా తరలిరావాలని పిలుపునిచ్చారు. కల్లూరు మండలం లింగాల గ్రామంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు దోరేపల్లి పట్టాభిరామ్ గృహప్రవేశానికి ఆదివారం ఆమె హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమెకు గ్రామ శివారున అభిమానులు ఘనస్వాగతం పలుకుతూ గజమాలతో సత్కరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. అధికారంలోకి రావడానికి అబద్ధాలు ఆడి ఒక్క హామీ కూడా నెరవేర్చకుండా ప్రజలను మోసం చేసిందంటూ కాంగ్రెస్ ప్రభుత్వంపై మండిపడ్డారు. రైతులను కాంగ్రెస్ ప్రభుత్వం నట్టేట ముంచిందని, అకాల వర్షాలు వచ్చి పంటలు నష్టపోతున్నా పట్టించుకోలేదని ఆరోపించారు. రైతుభరోసా, రుణమాఫీ సగంసగం ఇచ్చిందని, మహిళలకు చేయూత, కల్యాణలక్ష్మికి రాంరాం పకలికిందని, నిరుద్యోగ భృతి, పింఛన్లు పెంపుదలను మరిచిందని విమర్శించారు. అప్పులు చేస్తేనే ప్రభుత్వం నడిచే పరిస్థితి ఏర్పడిందన్నారు. భూములు అమ్మడం, రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసుకోవడం వంటి పనుల్లో ముఖ్యమంత్రి, మంత్రులు బిజీగా ఉన్నారని విమర్శించారు. అకాల వర్షాలకు పంటలు కోల్పోయిన రైతులకు ఎకరాకు రూ.20 వేల పరిహారం ఇచ్చేంత వరకు రైతుల తరపున పోరాడుతామని స్పష్టం చేశారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య మాట్లాడుతూ.. వరంగల్ సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీ తాతా మధు, ఇల్లెందు మాజీ ఎమ్మెల్యే హరిప్రియ, బీఆర్ఎస్ నేతలు పాలెపు రామారావు, కట్టా అజయ్‌బాబు, బీరవల్లి రఘు, లక్కినేని రఘు పాల్గొన్నారు.

మూడంచెల్లో అప్పీలుకు అవకాశం

- భూమికి గుర్తింపుగా 'భూధార్'
- రాయిగూడెం గ్రామసభలో ఖమ్మం అదనపు కలెక్టర్

రాయిగూడెం గ్రామసభలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి

కూసుమంచి (నేలకొండపల్లి), ఏప్రిల్ 20: రాష్ట్ర ప్రభుత్వం తెచ్చిన భూభారతి చట్టంలో అధికారులు జారీ చేసే హక్కు పత్రాలపై అనుమానాలుంటే మూడంచెల్లో అప్పీలుకు వెళ్లే అవకాశం ఉందని అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. మనిషికి ఆధార్ ఉన్నట్లుగానే భూమికి భూధార్ కార్డులు జారీ చేయనున్నట్లు చెప్పారు. నేలకొండపల్ల రాయిగూడెంలో ఆదివారం ఏర్పాటు చేసిన భూ భారతి గ్రామసభలో ఆయన మాట్లాడారు. ప్రతీ భూమికీ హద్దులు నిర్ణయించి హక్కు పత్రాలు ఇచ్చేలా ఈ చట్టాన్ని తయారు చేసినట్లు చెప్పారు. ఏటా 31 నాటికి రెవెన్యూ రికార్డులు క్రమబద్ధీకరిస్తామని, వాటి నకళ్లు పొందుపరుస్తామని అన్నారు. భూ భారతి చట్టంపై అధికారులు అవగాహన కలిగి ఉండాలని, ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. అనంతరం గ్రామస్తుల నుంచి అర్జీలు స్వీకరించారు. స్పెషల్ ఆఫీసర్ రాజేశ్వరి మాట్లాడుతూ.. గ్రామాల్లో భూ సమస్యలకు పూర్తి పరిష్కారం లభిస్తుందని అన్నారు. ఇంకా ఏవైనా సవరణలుంటే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు. పైలట్ మండలాల్లో వచ్చిన ఫిర్యాదులు, సూచనల ఆధారంగా ప్రభుత్వం ఈ చట్టంలో మరికొన్ని సవరణలు చేస్తుందని అన్నారు. తహసీల్దార్ వెంకటేశ్వర్లు, ఏడీఏ సరిత, ఏవో రాధ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

భూముల సమస్యలకు.. సులభ పద్ధతిలో పరిష్కారం

- పట్టా పుస్తకాల్లో మ్యాపింగ్‌తో భూములకు రక్షణ
- టేకులపల్లి అవగాహన సదస్సులో భద్రాద్రి కలెక్టర్

మాట్లాడుతున్న భద్రాద్రి కలెక్టర్ జితేశ్ వి పాటిల్

టేకులపల్లి, ఏప్రిల్ 20: రాష్ట్రంలో నూతనంగా అమలుచేస్తున్న భూ భారతి చట్టంతో భూ సమస్యలు సులభ పద్ధతిలో పరిష్కారమవుతాయని భద్రాద్రి కలెక్టర్ జితేశ్ వి పాటిల్ పేర్కొన్నారు. టేకులపల్లి తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో తహసీల్దార్ నాగభవాని అధ్యక్షతన ఆదివారం ఏర్పాటుచేసిన భూభారతి చట్టం అవగాహన సదస్సుల్లో స్థానిక ఎమ్మెల్యే కోరం కనకయ్యతో కలిసి కలెక్టర్ మాట్లాడారు. నూతన భూభారతి చట్టం ద్వారా భూముల సమస్యలు పరిష్కారమవుతాయని, రైతుల భూములకు ఐడీ ఇస్తామని అన్నారు. రైతు పట్టాదారు పాస్ పుస్తకంలో అతడి పొలాన్ని మ్యాపింగ్ చేస్తామని అన్నారు. దీంతో వారి భూములకు రక్షణ ఉంటుందని తెలిపారు. కొత్తగూడెం ఆర్‌డీవో మధు, ఇల్లెందు ఏడీఏ లాల్‌చంద్, ఎంపీడీవో రవీంద్రరావు, సీఐ సురేశ్, సొసైటీ చైర్మన్ లక్కినేని సురేందర్‌రావు, ఏవో అన్నపూర్ణ, డిప్యూటీ తహసీల్దార్ ముత్తయ్య, ఎంపీవో గణేశ్ గాంధీ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ పాలనలోనే రాష్ట్రం సుభిక్షం

- అబద్ధాలతో మోసం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం
- గులాబీ జెండా ఆవిష్కరణలో జడ్పీ మాజీ చైర్మన్ లింగాల కమల్‌రాజు

జెండాను ఆవిష్కరిస్తున్న జడ్పీ మాజీ చైర్మన్ కమల్‌రాజు

మధిర, ఏప్రిల్ 20 : బీఆర్ఎస్ పాలనలోనే రాష్ట్రం సుభిక్షంగా ఉంటుందని, రాష్ట్ర ప్రజలకు కేసీఆర్ పాలనే శ్రీరామరక్ష అని ఖమ్మం జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ లింగాల కమల్‌రాజు అన్నారు. అబద్ధపు హామీలతో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తున్నదని విమర్శించారు. ఆదివారం మధిర మండలం మాటూరు గ్రామంలోని కేసీఆర్ కాలనీలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో జెండాను విష్కరించారు. ఈ సందర్భంగా చిన్నారులు, కార్యకర్తలు, నాయకులు ఉత్సాహంగా నృత్యాలు చేశారు. కమల్‌రాజు మాట్లాడుతూ రాష్ట్రంలో పదేండ్లపాటు పరిపాలన చేసి కేసీఆర్ ప్రజలకు అండగా నిలిచారన్నారు. 18నెలల పాలనలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తూ ప్రజా సమస్యలను గాలికి వదిలేసిందన్నారు. ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. రాష్ట్రంలో రాబోయేది మళ్లీ కేసీఆర్ పాలనే అని ఆశాభావం వ్యక్తంచేశారు. ఈ నెల 27వ తేదీన జరిగే బీఆర్ఎస్ రజతోత్సవ సభలో అధికసంఖ్యలో ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల కార్యదర్శి బొగ్గల భాస్కర్‌రెడ్డి, నాయకులు వంకాయలపాటి నాగేశ్వరరావు, ఆళ్ల నాగబాబు, మాజీ సర్పంచ్ మేడిశెట్టి లీలావతి, నాగేశ్వరరావు, పల్లపాటి కోటేశ్వరరావు, కూటం కోటేశ్వరరావు, వెంకయ్య, యూత్ నాయకులు కోటేశ్వరరావు, అశోక్, మాజీ కౌన్సిలర్ యన్నంశెట్టి అప్పారావు, పరిశా శ్రీనివాసరావు పాల్గొన్నారు.